

కథా కౌముది

# క్రమశిక్షణ అను సభాపర్వము

పాలపర్తి జ్యోతిష్మతి

సాయంత్రం ఏడుగంటల వేళ పరంధామయ్యగారు వరండాలో కూర్చుని రోడ్డుమీద వచ్చేపోయే జనాల్ని చూస్తూ కాలక్షేపం చేస్తుండగా రాంబాబు గేటు తీసుకుని లోపలికి వచ్చాడు.

"రావయ్యా, రా!" అంటూ ఆనందంగా ఆహ్వానించి కూర్చోమని ఎదురుగా ఉన్న కుర్చీ చూపించారు పరంధామయ్యగారు.

"నమస్కారం మాస్టరుగారూ! నా పుస్తకం ఆవిష్కరణ సభ రేపు ఉదయం పది గంటలకి 'క్రమశిక్షణ' కోచింగ్ సెంటర్‌లో జరుగుతుంది. మీరు వచ్చి ఆశీస్సులు అందించాలి" కూర్చుంటూ చెప్పాడు రాంబాబు.

"అలాగేలే కానీ... సభ ఎక్కడన్నావ్?"

"క్రమశిక్షణ కోచింగ్ సెంటర్ మాస్టారూ!"

"కోచింగ్ సెంటర్ అంటే... ఏం నేర్పిస్తారు వాళ్ళు? క్రమశిక్షణ ఏంటి?"

"కోచింగ్ సెంటర్ పేరు 'క్రమశిక్షణ' మాస్టారూ. అక్కడ పోటీపరీక్షలకి శిక్షణ ఇస్తారు. కంప్యూటర్ ట్రైనింగ్ ఇస్తారు. సంగీతం, నృత్యం, నాటకం లాంటి కళలని ప్రోత్సహిస్తారు. ప్రముఖులైన పెద్దవాళ్ళని పిలిచి వ్యక్తిత్వ వికాస ఉపన్యాసాలు ఇప్పిస్తారు. ఇటువంటి సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తారు. వాట్ నాట్ – ఎవ్విరిథింగ్" అంటూ చేతిసంచిలోంచి పుస్తకం, ఆహ్వానపత్రం తీసి పరంధామయ్యగారి చేతిలో పెట్టాడు రాంబాబు.

"ఎక్కడ ఉందది? సభ అక్కడెందుకు పెట్టుకుంటున్నావు?"

"నన్నీ పుస్తకం రాయమని అడిగి, ప్రోత్సహించి, రాశాక ముద్రించి, ఈ ఆవిష్కరణ సభని ఏర్పాటు చేసింది అంతా 'క్రమశిక్షణ' కోచింగ్ సెంటర్‌వాళ్ళే. వాళ్ళ ఆవరణలోనే సభ జరపాలని వాళ్ళు కోరుకున్నారు. ఇది అడ్రసు" అంటూ ఆహ్వానపత్రంలో చూపించాడు రాంబాబు.

పరంధామయ్యగారు పుస్తకం అటూఇటూ తిప్పి చూసి "పుస్తకం పేరుకూడా క్రమశిక్షణే. అంటే ఆ సంస్థ గురించి రాశావా?" అని అడిగారు.

"సగభాగం మానవజీవితంలో క్రమశిక్షణ అవసరం గురించి, మిగతా సగం 'క్రమశిక్షణ' కోచింగ్ సెంటర్ గురించి రాశానండీ."

"పుస్తక సమీక్ష ప్రొఫెసరుగారిచేత చేయిస్తున్నారా? చాలా బాగుంది. సుదర్శనంగారిని కూడా పిలిచారే!" ఆహ్వానపత్రం చూస్తూ ఆనందంగా అన్నారు పరంధామయ్యగారు.

''అవునండీ! ప్రొఫెసరుగారు చాలా బాగా మాట్లాడతారు. ఆయనచేత సమీక్ష చేయిస్తే పుస్తకానికి మంచి పేరు వస్తుంది. సుదర్శనంగారికి నేనంటే చాలా అభిమానం. అందుకే మీపేరుతోబాటు ఆయనపేరుకూడా ఆశీస్సులు కింద వేశాను.''

ఆహ్వానపత్రాన్ని పరీక్షగా చూస్తూ "నాపేరుకూడా వేశావా? ఎందుకు?" ఆశ్చర్యం, కంగారు మిళితమైన స్వరంతో అడిగారు పరంధామయ్యగారు.

"పుస్తకం రాయడం మొదలుపెట్టే ముందే మీ దగ్గరికి వచ్చి 'ఒక పుస్తకం రాయబోతున్నాను, నన్ను ఆశీర్వదించండి' అని పాదనమస్కారం చేసుకుని వెళ్ళాను కదండీ! మీకు గుర్తు లేదేమో, అప్పుడే చెప్పాను 'పుస్తకం పూర్తయ్యాక ఆవిష్కరణసభకు వచ్చి మళ్ళీ మీ ఆశీస్సులు అందించాలి' అని."

"గుర్తుందిలేవయ్యా! కానీ... ఏదో... ఆరోజులాగే నాలుగు అక్షింతలు నెత్తిన వేసి ఆశీర్వదించడం అనుకున్నాను. ఆహ్వానపత్రంలో పేరు వేస్తారని ఊహించలేదు" అన్నారు పరంధామయ్యగారు మొహమాటంగా.

"క్రమశిక్షణ కోచింగ్ సెంటర్‌వాళ్ళు అట్లా ఒప్పుకోరండీ! వేదికమీద ఆశీస్సులు అందించేవాళ్ళ పేర్లు ఆహ్వానపత్రంలో వెయ్యాల్సిందే. ఆహ్వానపత్రంలో పేరు లేనివాళ్ళకి వేదికమీద మాట్లాడే అవకాశం ఇవ్వరు. నా శ్రేయోభిలాషిగా వేదికమీద మీరు నాగురించి నాలుగు మంచిమాటలు చెప్పాలని నా కోరిక. ఇవాళ నేను ఒక పుస్తకం రాశానంటే అదంతా మీ చలవే, మీరు వేసిన పునాదే" వినయంగా చెప్పాడు రాంబాబు.

'సరేలే!' అన్నట్టు తలూపి ఆహ్వానపత్రాన్ని నిశితంగా పరిశీలిస్తూ "ఇదేమిటి ఈ ఆహ్వానపత్రంలో ప్రతి పేరు పక్కన 'నుండి, వరకు' అంటూ ఏవో అంకెలు వేశారు?" అడిగారు పరంధామయ్యగారు.

"అది టైమండీ! ముందు గం. అని, చివర ని. అని ఉంది చూడండి. ఎవరి పేరు పక్కన ఏ టైం ఉందో ఆ టైంలోనే వాళ్ళు మాట్లాడాలి. అంటే – మొదట ఉన్న ఆ గంట ఆ నిముషం నుంచి తరువాత ఉన్న ఆగంట ఆ నిముషం దాకా వాళ్ళు మాట్లాడాలి. 'క్రమశిక్షణ' కోచింగ్ సెంటర్ వాళ్ళకి క్రమశిక్షణే ప్రాణం. అందుకే సంస్థ పేరు అదే పెట్టుకున్నారు. ఈ పుస్తకం అడిగిమరీ రాయించుకున్నారు. టైమంటే టైమే. సరిగ్గా పది గంటలకి సభ మొదలవుతుంది. ఎవరికి ఎంత టైము ఇచ్చారో అంతే మాట్లాడాలి. ఒంటిగంటకి ప్రాంగణం ఖాళీ అయిపోవాలి."

“పది నిముషాలు నేనేమి మాట్లాడతాను? సభాహ్వానానికి మూడు నిముషాలు ఎట్లా సరిపోతుంది? ప్రొఫెసరుగారిగురించి, సుదర్శనంగారి గురించి మంచి పరిచయవాక్యాలు చెప్పాలి కదా? వందన సమర్పణకి రెండు నిముషాలే చాలా?” గుక్క తిప్పుకోకుండా ప్రశ్నల వర్షం కురిపించారు పరంధామయ్యగారు.

“వేదికమీద సాధ్యమైనంత తక్కువమంది ఉండాలన్నది ‘క్రమశిక్షణ’ కోచింగ్ సెంటర్ వాళ్ళ పాలసీ. నేను, ప్రొఫెసరుగారు, సభాధ్యక్షులు మాత్రమే వేదికమీద కూర్చుంటాము. ఆశీస్సులు అందించే వాళ్ళని వాళ్ళ సమయానికి పిలుస్తారు, అంతే. అందుకని సుదర్శనంగారి గురించి పరిచయ వాక్యాలేమీ ఉండవు. వేదిక మీదికి పిలిచినప్పుడు పైకి వచ్చి కూర్చోడానికి టైం పడుతుంది కాబట్టి సభాహ్వానానికి మూడు నిముషాలు ఇచ్చారు. వందన సమర్పణ గబగబా చెప్పెయ్యచ్చు కాబట్టి రెండు నిముషాలే. ప్రొఫెసరుగారి పరిచయం సభాధ్యక్షులే చేస్తారు. సభాధ్యక్షులు ‘క్రమశిక్షణ’ కోచింగ్ సెంటర్ ప్రిన్సిపాలే. అన్నీ వాళ్ళే చూసుకుంటారు. సమయంగురించి మనం ఆలోచించక్కర్లేదు.”

‘వ్యవహారమేదో ఇరకాటంగానే ఉంది’ అని మనసులో అనుకుని “నేను ఒక్కణ్ణే రాలేను. మా అబ్బాయి దింపాలి. వాడి పనులు వాడికి ఉంటాయి కదా! సరిగ్గా పదిగంటలకల్లా అక్కడ ఉండడం కుదరదు. ఆలస్యంగా వస్తే ఫరవాలేదా? టైం ప్రకారం గేట్లు మూసేస్తారా?” ఇబ్బందిగా అడిగారు పరంధామయ్యగారు.

“ఫరవాలేదు మాస్టరుగారూ! మీ వీలు ప్రకారం రండి. సుదర్శనంగారికంటే మీరే పెద్దవారైనా ఆయన ప్రస్తుతం నా పై అధికారి కాబట్టి ఆయనపేరే ముందు వేశాం. మీకిచ్చిన సమయం పదకొండు యాభైమూడు నించి పన్నెండు మూడుదాకా. మీ పేరు పిలిచే టప్పటికి మీరు అక్కడ ఉంటే చాలు.”

“అబ్బే అంత ఆలస్యం కాదులే. ప్రొఫెసరుగారి మాటలు వినాలి. ముందే వస్తాను” అన్నారు పరంధామయ్యగారు ఆహ్వానపత్రంలో ప్రొఫెసరుగారి టైం స్లాట్ చూసుకుంటూ.

గురువుగారికి మళ్ళీ ఒకసారి నమస్కరించి వెళ్ళిపోయాడు రాంబాబు.

★★★

పరంధామయ్యగారు సభాప్రాంగణంలోకి అడుగు పెట్టే టప్పటికి అందరూ మౌనంగా కూర్చుని ఉన్నారు. మెల్లగా వెళ్ళి ఖాళీగా ఉన్న ఒక కుర్చీలో కూర్చుని చుట్టూ పరికించి చూశారు. నెమ్మదిగా ఒక్కొక్కరు సెల్‌ఫోన్లు బయటికి తీసి నొక్కుకోవడం మొదలు పెట్టారు. ఇంకో రెండు నిముషాలు గడిచేటప్పటికి పక్కవాళ్ళతో గుసగుసగా మాట్లాడడం మొదలు పెట్టారు అందరూ. పరంధామయ్యగారు ధైర్యంచేసి పక్కన కూర్చున్న కుర్రాణ్ణి “ఏమిటి అందరూ ఇట్లా కూర్చున్నారు?” అని అడిగారు.

“ఎవరు వచ్చారు, ఎవరు రాలేదు అన్నదాంతో సంబంధం లేకుండా కార్యక్రమం సరిగ్గా పదింటికి మొదలైంది. సభాహ్వానం, ప్రార్థనలాంటి ఫార్మాలిటీస్, సాంస్కృతిక కార్యక్రమాలు అన్నీ టైం ప్రకారం పూర్తయ్యాక అధ్యక్షుని

తొలిపలుకులు అంటూ ప్రిన్సిపాల్ వాళ్ళ సంస్థగురించి ఒక ఆరగంట కొట్టాడు. తరువాత రాంబాబుగారి పుస్తకం గురించి ప్రొఫెసరుగారు అరగంట మాట్లాడాలి...”

“ప్రొఫెసరుగారి ఉపన్యాసం జరుగుతూ ఉంటుంది, వినొచ్చు అనుకున్నాను. అయిపోయిందా? ఏం చెప్పారు?” కుర్రాడి మాటలు పూర్తవకుండానే ఆత్రంగా అడిగారు పరంధామయ్యగారు.

“ప్రొఫెసరుగారు – చిన్నతనంలో ఆయనకి గురువులు, తల్లిదండ్రులు నేర్పిన క్రమశిక్షణగురించి, తరువాత ఆయన తన శిష్యులకు బోధించిన క్రమశిక్షణా సూత్రాలగురించి పావుగంట చెప్పి కూర్చున్నారు. అధ్యక్షులవారు ‘ఇంకా పావుగంట సమయం ఉంది, పుస్తకంగురించి చెప్పండి’ అన్నారు. ‘ఇరవై పేజీల పుస్తకానికి పాతిక పేజీల ముందుమాటలు ఉన్నాయి. దాన్ని మించి నేను చెప్పేది ఏమీ లేదు, చదువుకుంటారు లెండి’ అన్నారు ప్రొఫెసరుగారు లేవకుండా. సభానిర్వాహకులు చర్చించుకుని ‘సుదర్శనంగారికి కేటాయించిన సమయానికే ఆయనకి మైకు ఇవ్వాలని, అప్పటిదాకా మౌనంగా కూర్చోవాలని’ నిర్ణయించారు. అదీ ఇప్పుడు జరుగుతోంది” అని చెప్పాడు ఆ కుర్రాడు.

మౌనసభ సమయం ముగియగానే సుదర్శనంగారిని ఆశీస్సులు అందించవలసిందిగా కోరుతూ ఆహ్వానించారు. సుదర్శనంగారు రాంబాబుతో ఆయనకున్న పరిచయం, ఉద్యోగంలో రాంబాబు నిజాయితి, నిబద్ధతలగురించి మాట్లాడుతుండగా సభాధ్యక్షులు “మీ సమయం తొమ్మిది నిముషాలు అయిపోయింది. ఇంక ఒక్క నిముషం మాట్లాడి ముగించండి” అన్నారు.

“ఇంకా పుస్తకంగురించి చెప్పందే! అదికూడా నాలుగు ముక్కలు చెప్పాలి కదా! అంత తొందరేంటి” అని అధ్యక్షులవారికి సమాధానం చెప్పి సుదర్శనంగారు మాట్లాడడం కొనసాగించారు.

కాసేపటికి “మీకు కేటాయించిన సమయం దాటి రెండు నిముషాలు అయింది. మీ ఉపన్యాసం ముగిసినట్టుగా భావిస్తున్నాం” అన్నారు సభాధ్యక్షులు విసుగ్గా లేచి నిలబడి.

సుదర్శనంగారు ఆయనవైపు సీరియస్‌గా చూసి మళ్ళీ మాట్లాడబోతుండగా సభాధ్యక్షులు మైకుకి చెయ్యి అడ్డం పెట్టి “సభ టైం ప్రకారం పర్ఫెక్ట్‌గా జరగాలి” అన్నారు.

సుదర్శనంగారు సభాధ్యక్షులతో వాగ్వాదానికి దిగారు. అట్లా ఇంకొంత కాలాతీతమయ్యాక సుదర్శనంగారు కోపంగా కిందకి వచ్చి కూర్చున్నారు. ఏమీ జరగనట్టు అతి మామూలుగా, ఆశీస్సులు అందించవలసిందిగా కోరుతూ పరంధామయ్యగారిని వేదిక మీదికి ఆహ్వానించారు.

పరంధామయ్యగారు భయంభయంగా వేదిక ఎక్కి “రాంబాబు నా శిష్యుడు అని చెప్పుకోడానికి గర్వ పడుతున్నాను. పుస్తకం నిన్న రాత్రి నా చేతికి అందింది. పెద్దవయసు అవడంవల్ల వెంటనే చదవలేక పోయాను. పుస్తకంలోని సంగతులు ఏమీ చెప్పలేను. ఒక మంచి విషయాన్నిగురించి పుస్తకం రాసిన రాంబాబును అభినందిస్తున్నాను. చిరంజీవ. సుఖీభవ” అంటూ రాంబాబు తలమీద చెయ్యిపెట్టి ఆశీర్వదించి వేదిక దిగివచ్చి కూర్చున్నారు.

"మాస్టరుగారు అతి క్లుప్తంగా ఆశీస్సులు అందించడంవల్ల మళ్ళీ సరిగ్గా కార్యక్రమాన్ని సమయంతో అనుసంధానించుకో గలుగుతున్నాం" అంటూ మొదలైన అధ్యక్షులవారి మలి పలుకులు క్రమశిక్షణ కోచింగ్ సెంటర్‌వాళ్ళ టైం మేనేజ్‌మెంట్ ప్లాన్‌ని వర్ణిస్తూ ఇరవై నిముషాలు సాగాయి. తరువాత రాంబాబు – సభ విజయవంతంగా జరిగినందుకు ఆనందాన్ని ప్రకటించి, సహకరించిన ప్రతిఒక్కరిని పేరుపేరునా అభినందించి, ప్రత్యేకంగా సుదర్శనంగారికి క్షమాపణలు చెప్పుకుని, పరంధామయ్యగారికి ధన్యవాదాలు తెలియజేసుకుని, హడావుడిగా ఐదు నిముషాల్లో రచయిత స్పందన ముగించాడు.

వందన సమర్పణ తరువాత "ఐదు నిముషాల్లో భోజన ఏర్పాట్లు జరుగుతాయి. ఇరవై నిముషాల్లో భోజనాలు ముగిస్తే తరువాత ఐదు నిముషాలు అన్నీ సర్దుకుని ఒంటిగంటకల్లా ప్రాంగణం ఖాళీ చేద్దాం" అని ప్రకటించారు.

బయటికి వెళుతున్న సుదర్శనంగారిని, పరంధామయ్యగారిని ఒక కార్యకర్త అడ్డుకుని "భోజనాలు చేసి వెళ్ళండి" అన్నాడు.

"మీ భోజనాలకోసం కూర్చోలేదు ఇంతసేపు. కార్యక్రమం చివరిదాకా ఎంత అద్భుతంగా నిర్వహిస్తారో చూద్దామని కూర్చున్నాను" అనేసి విసురుగా వెళ్ళిపోయారు సుదర్శనంగారు.

బిత్తరపోయిన కార్యకర్త "మీరు రండి మాస్టారూ" అంటూ పరంధామయ్యగారిని బ్రతిమాలాడు.

"నన్ను తీసుకెళ్ళడానికి మా అబ్బాయి వచ్చి బయట నిలబడి ఉన్నాడు, వెళ్ళాలి" అన్నారు పరంధామయ్యగారు సంకోచంగా ముందుకు కదలబోతూ.

"ఆయన్నికూడా వచ్చి భోజనం చెయ్యమనండి" అన్నాడు వెనకే నిలబడి జరుగుతున్నదంతా చూస్తున్న రాంబాబు.

"వద్దులే రాంబాబూ! సగం పళ్ళు లేవు. తొందరగా తినలేను. టైమయిపోయింది, తిన్నది చాలు అని చేతిలో పళ్ళెం లాక్కుంటే బాగుండదు. ఇంటికెళ్ళి ప్రశాంతంగా తింటాలే" అంటూ గేటుదాటి వెళ్ళిపోయారు పరంధామయ్యగారు.

★★★

COMMENTS